# నిజమైన ప్రేమ

**"ఏడ్చే మగవాడినీ, నవ్వే ఆడదాన్నీ నమ్మకూడదంటారు! నువ్వు... ఏమిట్రా యిలా ఏడుస్తున్నావు? లేచి ముఖం కడుక్కో. ప్రేమే జీవితం కాదు! జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే. మనం ఎన్నో అనుకుంటాం. అనుకున్నవి అవకపోవడమే జీవితంరా వినోద్! లేరా. లే. లేచి స్నానం చేసి భోంచెయ్యి" దినకర్ కొడుకుని సముదాయిస్తున్నాడు.**

అంతకు ముందు శ్రీలక్ష్మి వచ్చి కొడుకుని ఓదార్చి వెళ్ళింది. "బాబూ! నువ్వు యిలా ఏడుస్తుంటే నేను చూడలేకపోతున్నానురా. నాన్నగారు ఏది చెప్పినా నీ మంచి కోసమే చెప్తారు కదా. నాన్నగారు ఆ అమ్మాయిని చేసుకోవద్దన్నారు. అలా అనడానికి కారణాలేవో వుండి వుంటాయని నువ్వు అర్థం చేసుకోవాలి కాని ఇలా మొండిగా అలిగి తిండితిప్పలు మానేసి కూర్చుంటే ఎవరికిరా నష్టం?!"

"అమ్మా! నువ్వు నాకేం చెప్పకు! ప్రేమ గురించి నీకేం తెలుసు! నన్ను విసిగించక అవతలకు వెళ్లు. నన్నిలా వంటరిగా వుండనీ!" కసురుకున్నాడు వినోద్.

లోపలికి వెళ్ళి భర్తతో చెప్పి ఏడ్చింది శ్రీలక్ష్మి. అప్పుడు దినకర్ వచ్చాడు కొడుకుని ఓదార్చడానికి.

"వినోద్! నేను చెప్పేది విను. ఆమె నీపై ఆఫీసరు. రేపు పెళ్ళయితే ఆమె డామినేషన్ ఎక్కువగా వుంటుంది. అదీగాక ఆమె నీకన్నా వయసులో నాలుగేళ్ళు పెద్దది అంటున్నావు."

"నేను పెళ్ళి చేసుకుంటానని ఆమెకి మాట ఇచ్చాను. ఆమె గుళ్ళో పెళ్ళిచేసుకుందాం అంది."

"నీకు ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ. నువ్వు మాట యిచ్చివుంటావు. కాని మనసు యిచ్చివుండవు" అన్నాడు దినకర్.

వినోద్ ఆశ్చర్యంగా, అనుమానంగా చూసాడు తండ్రివైపు. "అదేంటి నాన్నా! అలా అంటున్నారు! మనసు యివ్వకపోవడం ఏంటి?"

"నీ మనస్తత్వం నాకు బాగాతెల్సు. నీది ఎలాంటి ప్రేమో నాకు తెల్సు."

వినోద్ బాగా హర్టయ్యాడు. వుక్రోషం వచ్చింది తండ్రిమాటలకు. "నాప్రేమంటే మీకు అంత చులకనగా వుందా?"

"ప్రేమని నేనెప్పుడూ గౌరవిస్తానురా. కాని మీ యిద్దరి మధ్యా వున్నది మాత్రం ప్రేమ కాదంటున్నాను."

"మీరంత ఖచ్చితంగా ఎలా చెప్తున్నారు?"

ఆమె గురించి ఎంక్వైరీ చేసి వివరాలన్నీ సేకరించాడు దినకర్. కాని ఆ విషయాలన్నీ తన

కొడుకులాంటి అమాయకుడికి ఎలా చెప్పాలో అర్థం కావడం లేదాయనకి.

"నీ ప్రేమ ఎలా మొదలయ్యిందో చెప్పమంటావా?"

'ఈయనకేమైనా దివ్యదృష్టి వుందా' అనుమానం కలిగింది వినోద్‌కి.

"ఆఫీసు పనిమీద ఆమె గదిలోకి నువ్వు అప్పుడప్పుడు వెళ్తూ వుండేవాడివి. ఆమె నీ మెతక స్వభావం చూసి ముచ్చటపడింది. నీలాంటివాడ్ని స్వంతం చేసుకుంటే జీవితంలో ఆమె ఆడింది ఆట, పాడింది పాట అవుతుందని ఆశపడింది. నిన్ను తనచుట్టూ తిప్పుకునేలా చేసింది. ఆమె నిన్నుచూసి నవ్వింది. నువ్వు కూడా నవ్వావు. ఎదుటివాళ్ళు ఏమాత్రం ఆప్యాయంగా మాట్లాడినా కరిగిపోయి, వాళ్ళచుట్టూ అల్లుకుపోయే సున్నిత స్వభావం నీది! ఆమె నీతో మాటలు పెంచింది. స్నేహం పెంచుకుంది. ఆఖరికి ఒకరోజు "నన్ను పెళ్ళిచేసుకుంటావా?"అని అడిగింది. నువ్వు అమాయకుడివి. అంత పెద్ద ఆఫీసరు నిన్ను అలా అడిగేసరికి నువ్వు ఉబ్బితబ్బిబ్బయిపోయావు! కాదనలేకపోయావు. అదృష్టదేవత అమాంతం నిన్ను వరించిందనుకున్నావు. పెళ్ళి చేసుకుంటానని వెనకా ముందూ ఆలోచించకుండా మాటయిచ్చేసావు! నిజం చెప్పు. ఇంతకు మించి ప్రేమ ఉందా మీ యిద్దరి మధ్యా? నీ చదువుకి, నీఉద్యోగానికి యింతకంటే మంచి సంబంధం మీ నాన్న తేలేడని నువ్వు భ్రమపడ్డావు. ఆమెకి తన మాట బుద్ధిగా వినే మగతోడు కావాలి. ఆ విధంగా మీ యిద్దరి మధ్యా "పెళ్లి" ఒక ఒప్పందం అయింది."

"మీరేదో కళ్ళతో చూసినట్లుగా నా గురించి అలాంటి స్టేట్‌మెంట్లు యిచ్చేస్తున్నారు నాన్నా! ఇది అన్యాయం. మీరు నా ప్రేమని కించ పరుస్తున్నారు. ఆమె గురించి చాలా దారుణంగా మాట్లాడుతున్నారు!"

దినకర్ మనసు బాధగా మూలిగింది. కొడుకు మనస్తత్వం, తొందరపాటు స్వభావం, వాడి అమాయకత్వం, మొండి ధోరణి - తనకి బాగా తెలుసు. కొడుకుని చూస్తుంటే జాలేసింది దినకర్‌కి.

"ప్రేమ అంటే యిదికాదు వినోద్! నిజమైన ప్రేమలో త్యాగం వుంటుంది. రాజీపడ్డం ఉంటుంది. ప్రేమంటే మనం వేసుకునే షర్టుకాదు, అది బాగున్నంత సేపూ వేసుకుని పాడైపోతే అవతల పారెయ్యడానికి! ప్రేమంటే జీవితాంతం గుండెల్లో పదిలంగా దాచుకునే అందమైన అనుభూతి!"

ఆ మాటలు వినోద్ మనసుకి ఎక్కలేదు. "ఆమెకి నేనంటే యిష్టం, తెలుసా?"

"ఇష్టమా! ఎలాంటి యిష్టం?"

"ఛ. మీకసలు ప్రేమ అంటే ఏమిటో తెలీదు నాన్నా! మీరెప్పుడైనా ఎవరినైనా ప్రేమిస్తేకదా 'ప్రేమ' విలువ తెలుస్తుంది!" కొడుకు మాటలు వాడిగా, వేడిగా చురుక్కుమని తగిలాయి దినకర్‌కి.

ఒక్క నిముషం అచేతనంగా ఉండిపోయాడు దినకర్.

వీడికేం తెలుసు 'ప్రేమ' అన్న రెండక్షరాల పదం తన మనసుని ఎలా కుదిపేసిందో, ఎలా ఆడించిందో! తనూ ప్రేమించాడు, కాని. ప్రేమలో ఓడిపోయాడు! అదేంటి? తన పిచ్చిగాని ప్రేమలో 'ఓడిపోవటం ఏమిటి?'

ప్రేమ యుద్ధం కాదు. ఓటమి-గెలుపులు చూసుకోవడానికి. 'ప్రేమకంటే జీవితం ముఖ్యం.

తన వాళ్ళ సుఖసంతోషాలు ముఖ్యం. ఇంటి పరువు-ప్రతిష్ఠలు ముఖ్యం. తనని కనిపెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల మనసులు కష్టపెట్టకుండా వుండడం ముఖ్యం. జీవితంలో యివన్నీ ముఖ్యం అనుకున్నవారికి 'ప్రేమ' అంత ముఖ్యం అనిపించదు. పెద్దలనెదిరించి తమ పంతాల కోసం పట్టింపులకోసం, తమ 'ప్రేమ'ని గెలిపించామన్న తృప్తి పొందడంకోసం చేసుకున్న ప్రేమ వివాహాలు చాలా వరకు సుఖప్రదం, సఫలీకృతం కావడం లేదు! పెద్దలనెదిరించి చేసుకున్న వివాహాలు తొంభై శాతం విఫలమైపోతున్నాయి. ఇరువైపుల పెద్దల సహాయ సహకారాలు లేకపోవడంతో మానసిక సంఘర్షణలకు లోనయి, కొన్నాళ్ళ తర్వాత ఒకరిమీద యింకొకరికి మోజు తగ్గిపోయి, రంగు వెలసిన బొమ్మల్లా అయిపోయి ఒకరి లోపాల్ని యింకొకరు ఎత్తి చూపడం మొదలు పెడతారు. కాని యిదంతా తనకొడుకు మనసుకి హత్తుకునేలా ఎలా చెప్పడం? వాడికసలు ఆలోచనా శక్తే లేదు.

తనకి ప్రేమ అంటే తెలీదా! తను ఎప్పుడూ ఎవర్నీ ప్రేమించలేదా? ప్రేమ విలువ తనకి తెలీదా? ఎంతెంత మాటలన్నాడు వాడు!

దినకర్ మనసంతా అదోలా అయిపోయింది. దినకర్ ఎప్పుడూ గతాన్ని గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చెయ్యడు.

ఇన్నాళ్ళకి గతం గుర్తొచ్చి దినకర్ దీర్ఘంగా నిట్టూర్చాడు. తన హృదయావేదన ఒకరికి చెప్తే తీరేది కాదు. అందుకే 'వేదన' అనే చేదుమాత్రకి సర్దుకుపోవడమనే తీపిపూత పూసి దిగమ్రింగాడు.

"వినోద్! నాకు 'ప్రేమ' అంటే ఏమిటో తెలియదన్నావు కదూ. అసలు ప్రేమంటే ఏమిటో తెలియనిది నీకురా! నేనూ వయసులో వున్నప్పుడు ఒకమ్మాయిని ప్రేమించాను! నా ప్రేమగాథ వింటావా?"

వినోద్ తెల్లబోయి చూస్తున్నాడు. తండ్రివైపు. తండ్రి తనతో ఇలా మాట్లాడ్డం ఇదే మొదటిసారి! కొత్తగా ఉంది! దినకర్ చెప్పడం మొదలుపెట్టాడు.

"నేను జయంతి అనే అమ్మాయిని ప్రేమించాను. జయంతి మా ఎదురింటి అమ్మాయి. సన్నజాజి పువ్వులా తెల్లగా, రజనీగంధ పువ్వులా సన్నగా, పొడుగ్గా వుండేది. మేం బరంపురంలో గాంధీనగర్‌లో వుండేవాళ్ళం. వాళ్లది ఛత్రపురం. జయంతి వాళ్ళ పిన్నివాళ్ళింట్లో ఉండి మెడిసిన్ చదువుతుండేది. అప్పట్లో మెడిసిన్ సీట్లు చాలా తేలిగ్గా దొరికేవి! నాక్కూడా మెడిసిన్ సీటు దొరికింది. కాని మా నాన్నగారు ఆర్థికస్తోమత లేక నన్ను మెడిసిన్ చదివించనన్నారు. అందుకని ఇంటర్మీడియట్ సైన్స్ చదివిన వాడిని బి.కామ్.లో చేరిపోయాను. జయంతి నాకళ్ళకు అప్సరసలా ఉండేది. జయంతి నవ్వు అందంగా వుంటుంది. నడక అందంగా వుంటుంది. నడుంవంపు అందంగా ఉంటుంది. మనం ప్రేమించే వాళ్ళు ఎలాగున్నా మన కళ్ళకి అందంగానే కన్పిస్తారు! అందుకే 'తావలచింది రంభ, తామునిగింది గంగ' అన్న సామెత పుట్టిందేమో!. నేనే చొరవచేసి ఆమెతో పరిచయం పెంచుకున్నాను. నేను అప్పుడప్పుడు క్లాసులు ఎగ్గొట్టి కల్లికోట కాలేజి నుంచి మెడికల్ కాలేజికి సైకిల్‌మీద వెళ్ళిపోయేవాడిని జయంతిని చూడ్డం కోసం, జయంతితో మాట్లాడ్డం కోసం! ఆమె యింటికొచ్చాక మాట్లాడొచ్చు. కాని వాళ్ళ పిన్నివాళ్ళు, మాఅమ్మావాళ్ళు ఏమనుకుంటారోనని

భయంగా ఉండేది మా యిద్దరికీ. నాకు మా నాన్నగారంటే చాలా గౌరవం, అభిమానం, భయం అన్నీను. ఆయన మాటలకి యింట్లో ఎవ్వరం ఎదురు చెప్పం. కాలేజికి శలవులివ్వగానే జయంతి ఛత్రపురం వెళ్ళిపోయింది. కోర్టు స్టేషన్ స్ట్రీట్‌లో వాళ్ళ యిల్లుండేది. జయంతిని చూడకుండా నేను ఉండలేకపోయేవాడిని. జయంతికూడా అంతే. ఆమెని చూడ్డానికి నేను ఒకరోజు యింట్లో చెప్పకుండా బస్సెక్కి ఛత్రపురం వెళ్ళిపోయాను. ఆరోజు జయంతీ నేనూ చాలాసేపు మాట్లాడుకున్నాం.

అప్పటి రోజులే వేరు. ఆ రోజుల్లో 'ప్రేమ'కు సరిహద్దులుండేవి. మేమిద్దరం దూరదూరంగా కూర్చుని ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకుంటూ మాట్లాడుకునే వాళ్లం. కాని యిప్పుడు కాలం మారిపోయింది. ప్రేమరూపం మారిపోయింది... మేమిద్దరం ఎప్పుడూ లిమిట్స్ దాటలేదు. కష్టసుఖాలు చెప్పుకుంటూ, యిష్టాన్ని మాటల్లో వ్యక్తపరుస్తూ, కలిసి బ్రతకాలనే కోరికని వెల్లడి చేస్తూ కబుర్లు చెప్పుకునేవాళ్లం.

ఆరోజు జయంతిని చూడ్డానికి వెళ్లిన నేను బస్సుదొరక్క రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికి చేరుకున్నాను. నాన్నగారు వీధి చావిట్లోనే వున్నారు. నేను లోపలికి అడుగు పెడుతూనే "ఎక్కడికి వెళ్లావురా? ఇంత రాత్రిదాకా ఆ తిరుగుళ్లేమిటి?" అని నిలదీసి కోపంగా అడిగారు.

నేను సరైన జవాబు దొరక్క తడబడ్డాను.

మర్నాడు పొద్దున్న జరిగినదంతా అమ్మకి చెప్పేసాను. అమ్మచాలా సంతోషించింది. "జయంతి చాలా మంచి పిల్లరా. అంత చదువుందన్న గర్వం లేదు. చాలా నెమ్మదైన పిల్ల! మనశాఖే. కాని నాన్నగారికి జాతకాల పట్టింపులున్నాయి. ముందు జాతకాలు నప్పాలికదా!" అంది అమ్మ నవ్వుతూ.

"జాతకాలు పడకపోతే ఏం చేస్తారు? పెళ్లి చేసుకోవద్దంటారా?" సందేహంగా అడిగాను. నా మనసులో ఎన్నో అనుమానాలు! నాకూ, జయంతికి పెళ్లవుతుందా? దేవుడు మా యిద్దరి నుదుటా ఏం వ్రాసాడు? మేం యిద్దరం కల్సి జీవితం సాగించడానికి అవకాశం వుంటుందా?

ఆఖరికి మొండిగా అన్నాను అమ్మతో "అమ్మా! ఇప్పుడే చెప్తున్నాను. జాతకాలు పడకపోయినా నేను ఆ అమ్మాయినే చేసుకుంటాను" అని.

అమ్మ, నాన్నగారితో విషయమంతా చెప్పింది. అమ్మ, జయంతి జాతకం వాళ్ల పిన్నినడిగి తెచ్చింది. నాన్నగారు జ్యోతిషశాస్త్రంలో దిట్ట. మహాపండితుడు. నాన్నగారు జాతకం అటు-యిటు తిప్పి ఆఖరికి అమ్మతో అన్నారు. "అమ్మాయి నక్షత్రం మంచిది కాదు. మఖ నక్షత్రం, మఖ నక్షత్రం మావగారికి గండం!"

అమ్మ గుండె గుభేలుమంది.

"ఇప్పటిదాకా మన వంశంలోకాని, తెలిసిన వాళ్ల కుటుంబాల్లోగాని ఎక్కడా మావగారు బ్రతికి వుండగా మఖ నక్షత్రం అమ్మాయిని కోడలిగాను, అత్తగారు బ్రతికి వుండగా అశ్లేష నక్షత్రం అమ్మాయిని కోడలిగానూ ఎవరూ తెచ్చుకోలేదు. ఈ పెళ్లి జరగదు. జ్యోతిషశాస్త్రాన్ని ఉల్లంఘించడం నేరం!" అన్నారు నాన్నగారు ఖచ్చితంగా. నేనూ గది బయట వింటున్నాను.

నాన్నగారి మాటలు నా చెవుల్లో పడుతున్నాయి స్పష్టంగా. నాన్నగారు నన్ను తనగదిలోకి పిలిచారు. జయంతి మదిలో మెదలగానే మొండి ధైర్యంతో గదిలోకి అడుగుపెట్టాను.

"ఏరా దినకర్! ఆ అమ్మాయిని యిష్టపడ్డావుటగా. పిల్లబాగానే ఉంటుంది. కాని ఆ అమ్మాయిది మఖ నక్షత్రం! మావగారికి గండం!"

"ఏమిటి నాన్నగారూ ఇంకా ఈ చాదస్తాలు? మఖ-మావగారికనీ, అశ్లేష- అత్తగారి కనీ, యతిప్రాసల కోసం వాడివుంటారు! అలాంటివన్నీ పట్టించుకున్నార్చంటే ఎలాగ? నాకు యిలాంటి వాటిల్లో నమ్మకం లేదు."

నాన్నగారు నావైపు తీక్షణంగా చూసారు. "నోర్ముయ్యి. నీకు నమ్మకం లేకపోయినా మాకుంది. నేను చెప్పినట్టునువ్వు వినితీరాల్సిందే" కోపంగా అరిచాడు ఆయన. తర్వాత కోపాన్ని నిగ్రహించుకుంటూ మళ్లీ అన్నారు.

"చూడు దినకర్ మేం పెద్దవాళ్ళం. చాదస్తాలు అనుకో, నమ్మకాలు అనుకో. మావి మాకుంది. ఇప్పటిదాకా నిష్ఠాగరిష్ఠులైన మన కుటుంబాలలో ఎవరూ చెయ్యని పనిని నేను చేసి బంధువుల మధ్య తలెత్తుకు తిరగలేను. అప్రతిష్ట తెచ్చుకోలేను. నీకు తండ్రి ముఖ్యం కాదు, ఆపిల్లే ముఖ్యం అనుకుంటే చేసుకో. కాని నేను బ్రతికున్నంత కాలం క్షణక్షణం చావుకి భయపడుతూ మనశ్శాంతి కరువై ఛస్తూ బ్రతకలేను" చెప్పదలుచుకున్నది చెప్పేసి నా ముఖం చూట్టం యిష్టంలేనట్టుగా అటువైపు ముఖం తిప్పేసుకున్నారు.

నా మనసు చివుక్కుమంది. అమ్మ వెంటనే మంగళసూత్రాలు బయటకు తీసి కళ్లకు అద్దుకుంటూ నావైపు దీనంగా చూసింది.

అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఇంతమందిని క్షోభపెట్టి, అయిన వాళ్లందరికీ మనశ్శాంతి లేకుండా చేసి నేను మాత్రం ఏం సుఖపడతాను?

నా ఒక్కడి సంతోషం కోసం యింతమందిని బాధపెట్టడంలో ఏమాత్రం సుఖం లేదనిపించింది. పెద్దల ఆశీస్సులు లేని జీవితాలు సుఖంగా సాగవు. జయంతిని చేసుకుంటే అటు నాన్నగారి మనశ్శాంతి మటుకేంగాని, నా మనసే నన్ను అనుక్షణం చిత్రవధ చేస్తుంది. 'తప్పుచేసావు' అంటూ. జీవితనౌక సవ్యంగా సాగడానికి ఒక మంచి తోడుఅవసరం. నా మంచిచెడ్డలు చూడ్డానికి తల్లిదండ్రులున్నారు. ఆపైన 'అదృష్టం' అన్నది మన ఎవ్వరి చేతుల్లోనూ లేదు. మనం పిలిస్తే రాదు. పొమ్మంటే పోదు. 'నా వాళ్ళు సంతోషంగా వుండడమే నాక్కావల్సింది' అని మనసుకు సర్ది చెప్పుకున్నాను. జీవితంతో రాజీపడ్డాను. మీ అమ్మని పెళ్లిచేసుకున్నాను. అయితే అప్పట్నుంచీ యిప్పటిదాకా నేను బాధపడే క్షణంగాని, విచారించే క్షణంగానీ రాలేదు. మీ అమ్మానేనూ ఎంతో హాయిగా వున్నాం. మనం వయసులో వున్నప్పుడు ఎన్నో అనుకుంటాం. మనం అనుకున్నవన్నీ అవ్వాలని ఎక్కడుంది? జయంతి కూడా పెళ్లి చేసుకుని సుఖంగా ఉంది. మేం మనసుపడ్డాం. కలిసి బతుకుదామనుకున్నాం. కానప్పుడు రాజీపడ్డాం. అంతే! జీవితం అంటే యింతే!"

★ ★ ★

"నాన్నా!" వినోద్ గొంతు జీరబోయింది. "మీ వెనక యింత కథ వుందా?"

"అవును. పొందాలనుకున్నవి అందనప్పుడు అందినవాటినే పొంది తృప్తిపడాలి. అదే జీవితంలో నేను నేర్చుకున్న పాఠం. నేను జీవితంలో యిప్పటిదాకా మీ అమ్మకి ఏ లోటూ చెయ్యలేదు. నావల్ల ఆమె ఎప్పుడూ అసంతృప్తి పొందలేదు. ఇప్పుడు చెప్పు, సర్దుకుపోవడంలోనే సంతోషం వుందని నేనంటాను. నువ్వేమంటావు?"

వినోద్ మాట్లాడలేకపోయాడు. ఇప్పుడిప్పుడే కొంచెం జ్ఞానోదయం అవుతున్నట్టుగా వుంది వినోద్‌కి. దినకర్‌కి కొడుకుని చూస్తే జాలేసింది.

'ఏది ఎలా అయితే అలా అవుతుంది. వాడిష్టప్రకారమే కానీ' అనుకున్నాడు.

"వినోద్! నువ్వు మాకు ఒక్కగానొక్క కొడుకువి. నువ్వు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే ఆ అమ్మాయి మనింట్లో మనతోపాటు వుండి కష్టసుఖాలు పంచు కుంటుందా? నీకు అన్నివిధాలా సహకరిస్తుందా? అన్నీ కనుక్కుని రా. పెళ్లి చేసుకునే ముందు బాగా ఆలోచించుకో. నాకు ఆమె మీద సదభిప్రాయం లేదు. ఆ తర్వాత నీ యిష్టం. అప్పుడు జీవితంలో సర్దుకుపోయాను. అలాగే యిప్పుడుకూడా సర్దుకుపోతాను. సర్దుకుపోవడం అన్నది నాకు కొత్తకాదు!" అతని గొంతు గద్గదమైంది.

★ ★ ★

"వాడినెలా పట్టావే నువ్వు? వాడు ఎన్నాళ్ళుంటాడు నీ దగ్గర? అప్పుడే నలుగురయ్యారు! వీడు అయిదోవాడా?" పకపక నవ్వుతోంది రాజీ.

పంకజం ఆ నవ్వుతో శృతికలిపింది. పెద్దగా పడీపడీ నవ్వుతున్నారు.

పూర్తిగా కాలిపోయిన సిగరెట్టుని ఏష్‌ట్రేలో గుచ్చుతూ పంకజం అంది.

"మా అమ్మని మోసం చేసినవాడు ఒక మగవాడు. పెళ్లికాకుండానే మా అమ్మ నన్నుకన్నది. మా నాన్న ఎవరో నాకు తెలీదు. అందుకే నాకు మగజాతి మీద కసి! అది ఈ విధంగా తీర్చుకుంటున్నాను. ఈ వినోద్ ఒక బచ్చాగాడు! వీడిదొక మెంటల్, సెంటిమెంటల్, అండ్ సెన్సిటివ్ కేస్! ఇలాంటి మెంటల్‌కేస్‌ని ఆరునెలలకంటే ఎక్కువ భరించలేం! నేను నాలుగు మాయమాటలు చెప్పగానే ఈజీగా నా ట్రాప్‌లో పడి పోయాడు పూర్‌ఫెలో!" మళ్లీ జోరుగా నవ్వులు!

వాళ్ల నవ్వులు... మాటలు... గాలిలో కల్సిపోయి వీధి వైపునకు వినిపిస్తున్నాయి. అయిదు నిముషాల క్రిందటే గుమ్మంలోకి అడుగుపెట్టిన వినోద్ చెవుల్లో వాళ్ళమాటలు స్పష్టంగా పడ్డాయి! వినోద్ శిలలా బిగుసుకుపోయాడు! మెదడు మొద్దుబారిపోయింది! తననెవరో వెనకనించి అగాధంలోకి తోసేస్తున్నట్టుగా అనిపించింది!

నాన్న చెప్పినట్టుగా తను నిజంగా పిచ్చివాడే. తను ఎంత మోసపోయాడు! తల్చుకుంటేనే వళ్లు గగుర్పొడుస్తోంది. అదృష్టం బాగుండి పెళ్లికి ముందే తను కళ్లు తెరిచాడు!

గబగబా అడుగులు వేస్తూ యింటిదారి పట్టాడు వినోద్.

★ ★ ★

*(ఆంధ్రభూమి, వీక్లీ: 13-9-2001)*